రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు, సుఖ శాంతులతో ప్రజలు తులతూగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాంక్షించారు. పండుగలు మన వారసత్వ ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత విలువ ఇచ్చే రాష్ట్ర ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన అభిలషించారు.

సిరిసంపదలతో తులతూగాలి: ఎంపీ వద్దిరాజు

సంక్రాంతి పండుగ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లు సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబురాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

మూడు రోజుల్లో ఏపీ వైపు 1.78లక్షల వాహనాలు

- హైదరాబాద్ -విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణ వాసులందరూ పల్లె బా ట పట్టారు. దీంతో హైదరాబాద్ నుం చి విజయవాడ, కర్నూలు, తమిళనా డు వెళ్లే దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతున్నది. చౌటుప్పల్, తుప్రాన్‌పేట, ఆందోల్ మైసమ్మ, పంతంగి టోల్ ప్లాజా తదిత ర ప్రాంతాల వద్ద పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నారు. మూడు రో జుల్లో 11టోల్ గేట్ల ద్వారా ఏపీ వైపు సుమారు 1,78,000 వాహనాలు వెళ్లాయి.

అమ్మకానికి మదర్ డెయిరీ ఆస్తులు!

మొదటిపేజీ తరువాయి...

యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) మూడున్నర దశాబ్దాల కాలంగా పాడి ఉత్పత్తిదారులకు ఆసరాగా నిలుస్తున్నది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 24 చిల్లింగ్ సెంటర్లు, 32 వేల మంది సభ్యులు, 432 సొసైటీల ద్వారా రోజుకు లక్ష లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. 3లక్షల మంది వినియోగదారులకు పాలు, పాల ఆధారిత ఉత్పత్తులను అందిస్తున్నది.

రూ.60కోట్ల అప్పులు అంటూ..

మదర్ డెయిరీ 26వ సర్వసభ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఈ నెల 9న సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 2న హయత్ నగర్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 'నార్మాక్ యూనియన్ రూ.60కోట్ల వరకు ఆర్థిక భారం ఏర్పడి రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు యూనియన్ స్థిరాస్తులు విక్రయించడానికి చర్చించి నిర్ణయం తీసుకోవడానికి..'

అని ఎజెండాలో స్పష్టం చేశారు.

ఉమ్మడి నల్లగొండలో 30.5 ఎకరాల అమ్మకం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూనియన్ పేరు మీద కొనుగోలు చేసిన భూములను అమ్మాలని స్కెచ్ వేశారు. నల్లగొండ జిల్లాలోని చిట్యాల పరిధిలో 29 ఎకరాలు, మిర్యాలగూడ పరిధిలోని 1.5 ఎకరాల భూమిని విక్రయించాలని ఎజెండాలో పేర్కొన్నారు.

గతంలో ఒప్పుకోని బీఆర్ఎస్ సర్కారు

పాడి రైతులకు వరంగా ఉన్న డెయిరీ ఆస్తులను అమ్మేందుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం ససేమిరా అంది. గతేడాది సెప్టెంబర్‌లో మదర్ డెయిరీ ఎన్నికల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు క్యాంపులకు విజయ డెయిరీ మాదిరిగానే మదర్ డెయిరీకి గ్రాంట్లు ఇప్పించి, అప్పులు తీర్చేలా ఆదుకుంటామని ప్రకటించారని సభ్యులు చెబుతున్నారు. లీటరుకు రూ.4 బోనస్ ఇస్తామని చెప్పి పాల రేట్లను తగ్గిస్తూ వచ్చారని వాపోతున్నారు.

ఆస్తులు విక్రయిస్తే ఉద్యమమే..

మదర్ డెయిరీ ఆస్తులు అమ్మడానికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందా? ఎన్నికల సమయంలో మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య చెప్పిన గ్రాంట్లు ఏమయ్యాయి..? లీటరుపై నాలుగు రూపాయల బోనస్ ఇవ్వకపోగా రేట్లు తగ్గించడం దారుణం. ఆస్తుల విక్రయం నిర్ణయాన్ని విరమించుకోవాలి. పట్టించుకోకుండా ముందుకు వెళ్తే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం.

- దొంతిరి సోమిరెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్

రిటైర్మెంట్ సడలింపుపై వీసీల గుర్రు

- రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా!
- 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ బోధకుల కొనసాగింపు
- రెగ్యులర్ ప్రొఫెసర్లకూ అరవై ఏండ్లకే పదవీ విరమణ
- ఉన్నత విద్యామండలి తీరును వ్యతిరేకిస్తున్న వీసీలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిబంధనలంటే అందరికీ సమానం. ఇక రిటైర్మెంట్ విషయంలో ఎవరికీ మినహాయింపేం కాదు. కానీ ఉన్నత విద్యామండలి మాత్రం ఈ విషయాన్ని విస్మరించి నడుచుకుంటున్నది. రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా నిబంధనలను అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నది. ఒకవైపు రెగ్యులర్ ప్రొఫెసర్లు 60 ఏండ్లకే పదవీ విరమణ పొందుతుండగా, 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తిరిగి కొనసాగించవచ్చని ఆదేశాలిచ్చింది. వర్సిటీలకు మండలి లేఖలు రాసింది. ఇది వివాదాస్పదమైంది. ఈ లేఖపై ఉన్నత విద్యామండలి వర్సెస్ వర్సిటీలు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇటీవల ఉన్నత మండలి అన్ని వర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో లేఖ ప్రస్తావన రాగా, ఓయూ, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదేం విధానమని, ఎలా కుదురుతుందని మండలి అధికారులను నిలదీసినట్టు తెలిసింది. అటానమస్ హోదా గల వర్సిటీల విషయంలో మండలి జోక్యం తగదని కొందరు వీసీలు అన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. మండలి కేవలం సూచనలు, సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని చెప్పినట్టుగా అధికారుల్లో చర్చలు నడుస్తున్నాయి.

అవసరముంటేనే తీసుకోవాలని సూచించాం

వర్సిటీల్లో అవసరముంటే 60 ఏండ్లు దాటిన వారిని తీసుకోవాలని సూచన మాత్రమే చేశాం. అవసరాన్ని బట్టి పరిశీలించమన్నాం. అదేం జీవో కాదు. కేవలం సర్క్యులర్ మాత్రమే. అయినా కొనసాగించాలా.. లేదా అన్నది వీసీల ఇష్టం. తప్పనిసరిగా అమలుచేయాలన్న నింబంధనలేం లేవు.

- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

'సంక్రాంతి' లింక్ క్లిక్‌చేస్తే లూటీ

- ప్రమాదకర మాల్‌వేర్‌తో సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ
- జాగ్రత్తలు పాటించాలంటున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'ఎంజాయ్ సంక్రాంతి స్పెషల్ ఫ్రీ రీచార్జ్.. 4 జీబీ డాటా వ్యాలిడిటీ టిల్ యువర్ కరెంట్ ప్యాక్ వ్యాలిడిటీ. ఆల్సో గెట్ 2 జీబీ డాటా ఆన్ యువర్ నెక్ట్స్ రీచార్జ్' అంటూ ఓ సైబర్ మోసగాడి నుంచి ఫేక్ మెసేజ్. 'సంక్రాంతి పండుగ సందర్భంగా మీ నంబర్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. మీకు 10 జీబీ డాటా ఉచితంగా అందించబడుతుంది. దీని కోసం మేము పంపిన లింక్‌ను క్లిక్ చేసి, మీ వివరాలు పొందుపర్చండి. ఆ తర్వాత ఆ మెసేజ్‌ను 10 మందికి పంపితే మీకు పూర్తి ఉచితంగా 10 జీబీ డాటా లభిస్తుంది' అంటూ మరో కేటుగాడి మెసేజ్. ఇలా.. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో ప్రకటనలు, మెసేజ్‌లతో అమాయకులకు వల వేసి డబ్బులు లూటీ చేస్తున్నారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తమైంది.ఇలాంటి ప్రకటనలకు ఎవరూ ఆశపడొద్దని, లింకులను క్లిక్ చెయ్యొద్దని సూచిస్తున్నది.

నా కుమారుడికి గుర్తింపు ఇవ్వలేదు

ఓపెన్ ఏఐపై సుచిర్ బాలాజీ తల్లి ఆరోపణ • మరణంపై ఎఫ్‌బీఐ విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 12: చాట్‌జీపీటీ అభివృద్ధిలో తన కుమారుడు ఎంతో కృషి చేసినప్పటికీ ఓపెన్‌ఏఐ సంస్థ మాత్రం తగిన గుర్తింపు ఇవ్వలేదని సుచిర్ బాలాజీ తల్లి అపర్ణారావు ఆరోపించారు. చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐలో సుచిర్ బాలాజీ నాలుగేండ్లు పని చేసి 2023 ఆగస్టులో రాజీనామా చేశారు. ఆ తర్వాత ఓపెన్‌ఏఐ అనైతిక చర్యలకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించి, పలు ఆధారాలను బయటపెట్టారు. ఈ క్రమంలో గత నవంబర్‌లో శాన్ ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో సుచిర్ బాలాజీ అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ విషయమై ఆయన తల్లి అపర్ణారావు మారియా నాఘల్ అనే సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్‌తో మాట్లాడుతూ..'చాట్‌జీపీటీని వేగంగా, సమర్థంగా అభివృద్ధి చేయడానికి నా కొడుకు తోడ్పడ్డాడు. కానీ తను మరణించే వరకు తన పనికి గుర్తింపు దక్కలేదనే బాధ అతడిలో ఉండేది. ఇప్పుడు కూడా సుచిర్ సేవలకు ఓపెన్‌ఏఐ తగిన గుర్తింపు ఇవ్వకపోవడం దురదృష్టకరం' అని ఆమె పేర్కొన్నారు. తమ కుమారుడి మరణం ఆత్మహత్యలా లేదని, అసలు నిజాన్ని తేల్చడానికి ఎఫ్‌బీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

- హైవేపై కిక్కిరిసిన వాహనాలు



హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా 16 టోల్‌బూత్‌లు ఉండగా.. విజయవాడ వైపు 11 బూత్‌లను తెరిచారు. గత సంక్రాతికి 77వేల వాహనాల రికార్డు ఉండగా.. ఇప్పుడు 6వేలు అధికంగా వెళ్లడంతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది.
– చౌటుప్పల్

సంక్రాంతి స్పెషల్ బాదుడు

- ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్న ఆర్టీసీ
- జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.240, నిర్మల్‌కు 650

ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్‌కు ఇద్దరికి ఇచ్చిన టికెట్ ధర

మెదక్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులపైన స్పెషల్ పేరిట ఆర్థిక భారం మోపుతున్నది రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ (టీజీఎస్ఆర్‌టీసీ). పండుగకోసం స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నది. స్పెషల్ బస్సుల పేరిట బోర్డులు తగిలించి ముక్కుపిండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక చార్జీలు పెట్టి కూడా దూర ప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తున్నదని పురుష ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిర్మల్, మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌తో పాటు నిజామాబాద్ జిల్లా బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నుంచి నడిపిస్తున్న కొన్ని బస్సులకు దూర ప్రాంతాల బోర్డులు వేసి స్పెషల్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచే తమకు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో డ్రైవర్‌తో ప్రయాణికులు ఘర్షణకు దిగారు. మెదక్ డిపో నుంచి సంక్రాంతి స్పెషల్‌గా ఎక్స్‌ప్రెస్ బోర్డుతో వచ్చిన టీఎస్ 35 జడ్ 0022 బస్సు ఉదయం 7:30 గంటలకు జేబీఎస్‌కు చేరుకుంది. జేబీఎస్‌లో ఆ బస్సు ఎక్కిన ప్రయాణికులతో డ్రైవర్ టికెట్ ఇచ్చి అధికంగా వసూలు చేశాడు. జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.160 చార్జి కాగా, అదనంగా రూ.80 వసూలు చేసి రూ.240 టికెట్ ఇచ్చాడు. అక్కడే ఉన్న మెదక్ డిపో మేనేజర్‌ను ఇదేమిటని అడుగగా, సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నామని సమాధానమిచ్చారు. జేబీఎస్ నుంచి నిర్మల్‌కు 650 వసూలు చేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, జనవరి 12: యువత, విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. టోర్నీ నిర్వాహకులను అభినందించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి మహేశ్, నిర్వాహకులు క్రాంతికుమార్, ముజామిల్, నాయకులు ఎండీ యాసిన్, కొండాల్‌రెడ్డి ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 12: హైబీపీ కారణంగా హరిదాస్‌నగర్‌కు చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పులి రాజు(38) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాజు టెన్షన్ పడుతూ, చివరకు హైబీపీ కారణంగా గత మంగళవారం హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, అధికారులు, తోటి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, బంధువులు పులి రాజు అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు.

కుక్కల గండి తండాకు బీటీ రోడ్డు నిర్మించండి

రుద్రంగి, జనవరి 12: మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ నుంచి కుక్కల గండి తండాకు బీటీ రోడ్డు నిర్మించాలని రుద్రంగి రైతులు ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. మార్గం మధ్యలో ఓరెలపై కల్వర్టులు నిర్మించాలని గ్రామానికి చెందిన దాదాపు 50మంది రైతులు విప్‌ను కోరారు. ఇక్కడ రైతులు, తదితరులు ఉన్నారు.

రెండవ స్థానంలో గంభీరావుపేట డెయిరీ

గంభీరావుపేట చైర్మన్‌కు బహుమతి అందిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

గంభీరావుపేట, జనవరి 12: గంభీరావుపేట కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఉమ్మడి జిల్లా పాల సేకరణలో రెండో స్థానంలో నిలిచిందని చైర్మన్ కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేట సంఘం నుంచి ఒక సంవత్సరంలో అత్యధికంగా 4లక్షల 66 వేల 444 లీటర్ల పాలు సేకరించి రెండో స్థానంలో నిలిచామన్నారు. ఆదివారం కరీంనగర్‌లో గంభీరావుపేట సంఘానికి బహుమతి అందించారని వారు తెలిపారు.

నకిలీ మీసేవ వెబ్ సైట్లతో మోసపోవద్దు

కలెక్టరేట్, జనవరి 12: నకిలీ మీసేవ వెబ్‌సైట్లతో మోసపోవద్దని, సెంటర్ ఏర్పాటు కోసం వెబ్‌సైట్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలంటూ వస్తున్న అసత్యప్రచారాన్ని నమ్మకూడదని జిల్లా ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీరామ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈజీ మనీ లక్ష్యంగా మోసగాళ్లు రెచ్చిపోతున్నారని, మీసేవ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సందేశాలు పంపడమే కాకుండా నకిలీ మీసేవ పోర్టల్‌ను రూపొందించారని వెల్లడించారు.

పకడ్బందీగా అర్హులను ఎంపిక చేయాలి

కలెక్టరేట్, జనవరి 12: రాష్ట్రంలో 26 నుంచి ప్రారంభంకానున్న పలు సంక్షేమ పథకాల కోసం జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా జరగాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరమే ఎంపిక జాబితాలో చేర్చాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రారంభంపై ఆయా శాఖల అధికారులతో ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి, మాట్లాడారు. నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేయాలని ఆదేశించారు. రైతు భరోసా పథకం కింద సాగుభూములకే ఏటా ఎకరాకు రూ.12వేల చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే పూర్తి చేయడాన్ని అభినందించారు. 2.10లక్షల ఇండ్ల సర్వే చేసి 66,271 దరఖాస్తులు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

అర్హులైనవిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద అందించనున్నట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులకు పైగా ఉపాధి పని చేసి ఉండాలన్నారు. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులు స్వీకరించి, అర్హులను ఎంపిక చేయాలన్నారు. 100 దరఖాస్తులకు ఒక అధికారిని నియమించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించాలన్నారు. 15లోగా మండలాల్లో అవగాహన సదస్సులు, శిక్షణ నిర్వహించాలని, 16 నుంచి 20వరకు గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. 21 నుంచి 23 వరకు రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించి, అర్హుల వివరాలు చదివి వినిపించాలని, 24,25 తేదీల్లో గ్రామ సభల్లో ఎంపిక చేసిన వివరాలు జిల్లా అధికారులు పరిశీలిస్తారని వెల్లడించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్‌బాబు, ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్‌కుమార్, పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలి
- అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

200 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

- కరీంనగర్‌లో పంపిణీ చేసిన ఎమ్మెల్యే గంగుల

లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

హౌసింగ్‌బోర్డుకాలనీ, జనవరి 12: కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదివారం కరీంనగర్ నియోజకవర్గంలోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. రూ.47 లక్షల విలువైన చెక్కులను 200 మందికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ది అరాచక పాలన

కలెక్టరేట్, జనవరి 12: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అంటూ సీఎం రేవంత్ రెడ్డి అరాచక పాలన సాగిస్తున్నాడని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు ఎన్ మదన్‌మోహన్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని కోతిరాంపూర్‌లోని సంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాదిగా కొనసాగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించిన జర్నలిస్టులను అణిచివేసేలా కాంగ్రెస్ పాలన సాగుతోందని విమర్శించారు. ఈ క్రమంలోనే జనగామ జిల్లాలో జర్నలిస్టు రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి జైలులో పెట్టారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల టైంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేసిన అతను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ నాయకులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తుండడాన్ని జీర్ణించుకోలేక, అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి తన సొంత సెగ్మెంట్‌లోనూ గిరిజనులపై ఇదే తరహాలో వ్యవహరించి జైలుకు పంపించడం తగదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు తనవంతు కృషి చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రతినిధులు రాజ్ మహ్మద్, వెంకటమల్లయ్య, ఎల్.రాంనారాయణ, మనీష్‌కుమార్, ఈర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి యూత్ అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

కోనరావుపేట, జనవరి 12: మామిడిపల్లిలోని శ్రీ సీతారామ స్వామి ఆలయ ఆవరణలో రెడ్డి యూత్ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా తీపిరెడ్డి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తీపిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కోశాధికారిగా తీపిరెడ్డి పెద్ద వేణురెడ్డి, కార్యదర్శిగా తీపిరెడ్డి సుకుమార్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా తీపిరెడ్డి అనిల్‌రెడ్డి, ఎల్లాల సంతోష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా తీపిరెడ్డి మహేందర్‌రెడ్డి వరుసగా ఐదోసారి ఎన్నిక కాగా, పలువురు గ్రామస్తులు, రెడ్డి యూత్ సభ్యులు అభినందనలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

యజ్ఞవరాహ క్షేత్రంలో తిరుప్పావై సదస్సు

కమాన్‌చౌరస్తా, జనవరి 12: కరీంనగర్‌లోని యజ్ఞవరాహక్షేత్రంలో సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో గోదా మధుర రాసిక్యమ్ పేరుతో తిరుప్పావై సదస్సును ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ట్రస్టు ఉపకులపతి శ్రీభాష్యం వర ప్రసాదశర్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, సంస్థానం ట్రస్టు ద్వారా క్షేత్రంతో పాటు పలు చోట్ల అనేక ధార్మిక, ఆధ్యాత్మిక, వైదిక కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల కృష్ణమాచార్య స్వామి, భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, డాక్టర్ ముడుంబై నరసింహరంగాచార్యులు, కండ్ల కుంట్ల శ్రీనివాసాచార్యులు, మరింగంటి అనంతాచార్యులు, సముద్రాల శఠగోపాచార్యులు పత్ర సమర్పణలు చేశారు. ఇక్కడ ఆలయ ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రబంధ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పండితులు

పాడె కట్టి.. రెండోసారి అంత్యక్రియలు నిర్వహించి

- శిలాయుగంలో మొదలైన ప్రక్రియను ఆచరించిన డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి
- చిన్నకర్మ రోజు కాట్నం ఎముకలతో దహన సంస్కారాలు
- స్వగ్రామం గంగిపెల్లిలో నిర్వహణ

మానకొండూర్ రూరల్, జనవరి 12: నవీన శిలాయుగం అంత్య దశలో రెండోసారి దహనం చేసే ప్రక్రియ ప్రారంభమైందని, ఆ ప్రక్రియ నేటికీ ఆచరణ రూపంలో కొనసాగుతూ వస్తున్నదని చరిత్ర పరిశోధకుడు డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి పేర్కొన్నారు. తన స్వగ్రామం గంగిపల్లిలో తన తల్లి రాధమ్మ పార్థివదేహాన్ని దహనం చేసిన తర్వాత చిన్నకర్మలో భాగంగా (10వ రోజు) ఆదివారం కాట్నం నుంచి ఎముకలు సేకరించారు. చిన్న పాడె తయారు చేసి దానిపై ఎముకలు పెట్టి, నిప్పు పెట్టారు. తిరిగి అందులో నుంచి ఎముకలు సేకరించి, నదిలో కలపడానికి చిన్న కుండలో భద్రపరిచినట్లు రత్నాకర్‌రెడ్డి చెప్పారు. జనగామ జిల్లా వడ్లకొండ గ్రామంలో సుమారుగా 4వేల ఏండ్ల కిందటి ఆదిమ మానవులు నవీన శిలాయుగం అంత్యదశలో రెండోసారి దహనం చేసిన చారిత్రక ఆధారాలను దేశంలో తొలిసారిగా తాను గుర్తించానని గుర్తు చేశారు. ఇదే సంస్కృతి కొద్ది మార్పులతో తన కుటుంబ వారసత్వంగా వస్తున్నదని పేర్కొన్నాడు. శిలా యుగంలో మొదలైన శవ దహన సంస్కృతిలోని భిన్న రూపాలు నేటికి అనేక ప్రాంతాల్లో కొనసాగుతూ వస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు సైతం ఉన్నారు.

*పాడె కట్టి, కాట్నం పేర్చుతున్